www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

శుక్రవారం 1 - 8 - 2025 సంపుటి : 1 సంచిక : 27 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్




V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ CMD

# మూడు నెలల గడువు





## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలి..

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఆదేశాలు

రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది

అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉంది

ఈ అంశంపై పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించాం

పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు

ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితం

తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నాం

ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి

ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందన్న ధర్మాసనం

న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం

2లో...



## ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

సర్వోన్నత న్యాయస్థానం తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తోంది

రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి

10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

2లో...

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలి

డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో మిగిలిన పనిని పూర్తి చేయాలి

ఆటంకాలు తలెత్తకుండా లైడార్ సర్వే వేగవంతం చేయాలి

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

## హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల ప్రమాణ స్వీకారం

ప్రమాణం చేయించిన సీజే అపరేశ్ కుమార్ సింగ్



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా వచ్చిన నలుగురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం హైకోర్టులో జరిగింది.

జస్టిస్ గౌస్ మీరా మొహినుద్దీన్, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కు మార్‌లతో సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ప్రమాణం చేయించారు. పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు



### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం కంప్యూటర్ సైన్స్, ఏఐ, డేటా సైన్స్, ఐటీ కోర్సులకు ప్రవేశం...

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఏఐ, డేటా సైన్స్, ఐటీ కోర్సులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశా లకు అనుమతి ఇచ్చారు. గత దశాబ్దకాలంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. తాజా నిర్ణయంతో ఇక్కడి విద్యార్థులకు మేలు కలగనుంది.

## ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమే



యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేల మందికి పైగా సందర్శకులు

అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయింటింగ్ ఏరియా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా ను ప్రారంభించిన మంత్రి

## రోహింగ్యాలు చొరబాటుదారులా?.. శరణార్థులా?

దీనిపై స్పష్టత వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయి

పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతాం

కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు



2లో...



## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై వేటు

అక్రమాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలు

కొనసాగుతున్న సీఐడీ, ఈడీ విచారణ

అపెక్స్ కౌన్సిల్ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం


విశ్వంభర, హైదరాబాద్: హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాసరావును అపెక్స్ కౌన్సిల్ సస్పెండ్ చేసింది. హెచ్‌సీఏలో అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఐడీ, ఈడీ విచారణ కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే జగన్మోహన్‌రావు, దేవరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వారిని సస్పెండ్ చేస్తూ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.

## ఎన్‌సీడీసీకి రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం...

గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద నాలుగేళ్లపాటు అందించనున్న కేంద్రం

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



విశ్వంభర, నేషనల్ బ్యూరో: నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద నాలుగేళ్లపాటు దీన్ని అందించనుంది.

రుణాల కింద మరిన్ని నిధులు సమకూర్చుకోవడానికి తాజా చర్య ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

దేశంలో 8.25లక్షలకు పైగా ఉన్న సహకార సంఘాల్లోని 29 కోట్ల మంది సభ్యులకు ఈ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. వీరిలో 94శాతం మంది రైతులే ఉన్నారు. కేంద్రం అందించే ఈ ఆర్థిక సాయం ద్వారా అదనంగా మరో రూ.20వేల కోట్ల రుణాలను ఎన్‌సీడీసీ సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్‌సీడీసీ రుణ రికవరీ రేటు 99.8శాతంగా ఉండగా.. సున్నా ఎన్‌పీఏ ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోంది

పార్టీ ఫిరాయింపులపై సుప్రీం తీర్పు.. మంచి పరిణామం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



విశ్వంభర, హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# మూడు నెలల గడువు...

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలి





**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు.. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని, అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని తీర్పులో ధర్మాసనం అభిప్రాయపడింది. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించామని సీజేఐ తెలిపారు.

"రాజేష్ పైలట్, దేవేంద్రనాథ్ మున్షీలా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రైబ్యునల్‌గా వ్యవహరిస్తారు. స్పీకర్ అలా వ్యవహరిస్తూనే రాజ్యాంగపరమైన రక్షణని పొందలేరు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నాం. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్ధరహితంగా మారుతుంది" అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్,

జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమా ర్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ తీర్పు వెలువడింది.

# ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమే

### యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేల మందికి పైగా సందర్శకులు
### అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయింటింగ్ ఏరియా - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
### తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా ను ప్రారంభించిన మంత్రి



**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, హైదరాబాద్ః మా ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రాంగణంలో రూ. 1.5 కోట్లతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్(టీజీఐఐసీ) అత్యాధునిక వసతులతో నిర్మించిన 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేల మందికి పైగా సందర్శకులు వస్తుంటారు. వేచి చూసేందుకు సరైన సౌకర్యాలు లేక ఇక్కడికొచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టికొచ్చింది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏం అవసరమో గుర్తించి... అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయింటింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం పారిశ్రామిక, సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఇది నిదర్శనం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'తెలంగాణ %-% అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఈవీ రంగాల్లో అమెరికా మన రాష్ట్రానికి అగ్రగామి వ్యాపార భాగస్వామి. మన ఐటీ ఎగుమతుల్లో 38 శాతం ఉత్తర అమెరికాకు జరుగుతున్నాయి. గూగుల్, అమెజాన్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ నిలయంగా ఉంది. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే అమెరికా కంపెనీలు మన రాష్ట్రంలో రూ.31,500 కోట్ల పెట్టుబడులను పెట్టాయి. ఫలితంగా 30వేల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి' అని చెప్పారు. ఈ కొత్త వెయిటింగ్ ఏరియా ద్వారా అంతర్జాతీయ భాగస్వామ్యాలు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, హైదరాబాద్: 'సత్యమేవ జయ తే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. "రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రోహింగ్యాలు చొరబాటుదారులా?.. శరణార్థులా?



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, నేషనల్ బ్యూరో:

రోహింగ్యాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య.. తొలుత దీనిపై క్లారిటీ వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. ఒకవేళ వాళ్లు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా? అని ప్రశ్నించింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు కాకుంటే, అక్రమ వలసదారులైతే.. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు? అని అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది. ఇదే అంశంపై ఈ ఏడాది మే నెలలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు .. దేశంలో ఉన్న రోహింగ్య శరణార్థులు విదేశీయులని తేలితే,

భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యూఎన్‌హెచ్‌సీఆర్ జారీ చేసిన ఐడీ కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చంటూ అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది.

ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ.. కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో ఓసారి వెల్లడించింది.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలి

### నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలని.. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో మిగిలిన పనిని పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదలశాఖపై సంబంధిత అధికారులతో మంత్రి గురువారం సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్జీఆర్ఐ, జీఎస్ఐతో కలిసి ఎలక్ట్రోమేగ్నటిక్ సర్వేను ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కచ్చితమైన ప్రణాళిక, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా లైడార్ సర్వే వేగవంతం చేయాలన్నారు. "వానాకాలం పంట కోసం జలశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలి. మొత్తం ఆయకట్టుకు నీరు అందేలా చూడాలి. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. నీరు లేక రైతులు ఎవరూ ఇబ్బంది పడొద్దు. శాఖ మొత్తం దూరదృష్టితో, జవాబుదారీతనంతో పనిచేయాలి. వర్షాకాలం నేపథ్యంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో సంభవించే అతి భారీ వర్షాలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలి. అన్ని జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టాలి. నీటిపారుదలశాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల్లో ఆక్రమణలు గుర్తించి తొలగించాలి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. స్థానిక మున్సిపల్, పోలీసు శాఖలను సంప్రదించి ఆక్రమణలు తొలగించాలి.

# విచారణ నివేదికను సమర్పించిన కాళేశ్వరం కమిషన్

### నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేత - 15నెలలపాటు 115మంది విచారణ.. సాక్షాల నమోదు



విశ్వంభర, హైదరాబాద్: కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి విచారణ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి వెళ్లి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. గురువారం జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

# బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

## - ధర్మస్థల ఘటన లో ట్రస్ట్ బోర్డు సభ్యులను అరెస్టు చేయాలి - ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలి- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

విశ్వంభర, హైదరాబాద్ః బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళలను రక్షించాల్సింది పోయి.. భక్షించే పరిస్థితికి వచ్చారు అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. . గురువారం బెంగళూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ఘోరమైన సంఘటన. 400మందికి పైగా మహిళలను పొట్టనపెట్టుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలి అని కోరారు. ట్రస్ట్ బోర్డు సభ్యులను తక్షణ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ధర్మస్థల ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. శాఖధర్మస్థలంలో బలమైన ట్రస్టీ ఉండగా అక్కడ వారు చెప్పిన వారే పాలకులుగా ఉండాలి. అక్కడ ఎన్నికలు కూడా నామినేటెడ్ పద్ధతిలో ఎన్నుకుంటున్నారు. కాదని పోటీకి దిగిన సీపీఎం పార్టీ నేతను ఏం చేయలేక అతని కుమార్తెను 1980లో చంపేసినట్లు ఆధారాలు బయటపడ్డాయని, ఇంకా విచారణ సాగుతోందన్నారు. అప్పటి నుంచి ఇంత మహిళలు చనిపోతున్నా గుర్తించలేకపోవడానికి గత బిజెపి తప్పిదంగా చెప్పారు. ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితిలో ఓ మహిళ మీడియా ఎదుట వచ్చి చెప్పే వరకు విషయం బయటకు రాలేదని, అక్కడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్కేవెంజర్ భయభ్రాంతులకు గురై విషయాన్ని బయటకు చెప్పినట్లు నారాయణ పేర్కొన్నారు. ఈ విషయంగా తీవ్రంగా భావించి




బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఆలయానికి సంబంధించి పదివేల కోట్లు డిపాజిట్లు, ఆస్తులు ఉన్నాయని ఏడాదికి 100 కోట్లపైగా ఆదాయం లభిస్తుందని అన్నారు. ఇంతటి ప్రసిద్ధి కలిగిన ఆలయాన్ని ప్రైవేటు ట్రస్టు ట్రస్టు బోర్డు కు వదిలివేయడం సమంజసమా అని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ కర్ణాటక నేత శివరాజ్, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి హరీష్ బాల పాల్గొన్నారు.

# పాక్‌కు చెక్.. చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది. కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, ఇటీవల సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే మొదలుపెట్టగా.. కొంత ఖర్చు కూడా చేసినట్లు సమాచారం. 2021లో కేంద్రం జోక్యం చేసుకుని ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యం చేయడంతోపాటు పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు



చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నీరు నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించాలన్నా.. పాక్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఎటువంటి అనుమతులు, సమాచారం పంచుకోవడం అవసరం లేదు.

# అన్ని విభాగాలలో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తాం

## - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



విశ్వంభర, నల్గొండ: నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాలలో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే రూపొందించి సమర్పించాల్సిందిగా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధిప రిచిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు .అంతేకాక డయాలసిస్ కేంద్రానికి వచ్చిన నూతన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ద్వారా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడంలో భాగంగా పోస్టుల భర్తీతో పాటు, ఎన్ఐసి, పిఐసి, ఆర్థోపెడిక్ తదితర అన్ని విభాగాలలో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని, అలాగే బ్లడ్ బ్యాంక్ కు అవసరమైన రిఫ్రిజిరేటర్ ఇతర సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఇందుకు కావలసిన సౌకర్యాలు,వైద్య పరికారాలపై స్పష్టంగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రసవం తర్వాత తల్లికి,బిడ్డకు పనికి వచ్చేలా ఎం సి హెచ్ కిట్లను అందించేందుకు అన్ని వస్తువులతో కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఫిజీషియన్, సర్జన్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.. ఆస్పత్రికి అవసరమైన ఇతర మౌలిక వసతులు, భవనాలు, సివిల్ పనులు,పోస్టులకు సైతం ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ అరుణ కుమారి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి ,ఆసుపత్రి వైద్యులు, తదితరులు ఈ సమక్షా సమావేశానికి హాజరయ్యారు.

# మద్యం సీసా తిరిగిస్తే.. రూ.20 వాపస్..!



విశ్వంభర, తిరువనంతపురంః పొద్దు కుంకితే చాలు.. బార్లు, వైన్ షాప్‌ల ముందు 'క్యూ' చూస్తూనే ఉంటాం. ఉచితంగా ఇస్తున్నారా? అన్న చందంగా మందుబాబులు ఆవురావురుమంటూ ఎగబడుతుంటారు. మద్యం తాగేసి ఆ బాటిల్‌ను పక్కకు విసిరేస్తారు. దీంతో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తుంటాయి. వారి తీరును మార్చేందుకు కేరళ ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి మద్యం బాటిల్‌పై అదనంగా రూ.20 ముందస్తు డిపాజిట్ చేయనున్నట్లు ప్రకటించింది. మళ్లీ అదే అవుట్‌లెట్‌లో బాటిల్‌ను తిరిగి ఇస్తే... డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇవ్వనున్నట్లు తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి 70 కోట్ల సీసాల మద్యం విక్రయిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో ప్రధాన ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిదారుగా నిలిచింది. మొత్తం అమ్ముడవుతున్న మద్యం బాటిళ్లలో కేవలం 56 కోట్ల బాటిళ్లు మాత్రమే రీసైకిల్ అవుతున్నాయి. మిగతావన్నీ వ్యర్థాలుగా మిగిలిపోతున్నాయి. దీనిని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఎం.బి. రాజేశ్ వెల్లడించారు. వీలైనంత వరకు గాజు సీసాల్లోనే మద్యం నింపాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అంత సులువు కానందువల్ల రూ.800 అంతకంటే ఎక్కువ ధర పలికిన మద్యాన్ని గాజు సీసాల్లోనే ఇవ్వాలని, రూ.800 కంటే తక్కువ ధర కలిగిన మద్యాన్ని ప్లాస్టిక్ బాటిళ్లలో సరఫరా చేసుకోవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. సెప్టెంబరులో కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుల కింద దీనిని చేపట్టి.. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే తరహా విధానాన్ని తమిళనాడు ఇప్పటికే అనుసరిస్తోంది.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాంః వద్దిరాజు రవిచంద్ర

విశ్వంభర, హైదరాబాద్ః పార్టీ ఫిరాయించిన శాసనసభ్యుల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ 3 మాసాలలోగా నిర్ణయం తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు. సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పును అనుసరిస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు తీసుకుంటారన్న ఆశాభావాన్ని ఎంపీ రవిచంద్ర వ్యక్తం చేశారు. ఒకపార్టీ బీ-ఫారంపై గెలిచిన చట్టసభల ప్రతినిధులు ఇంకో పార్టీలోకి ఫిరాయించిన సందర్భాల్లో వారికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సంవత్సరాల పాటు నాన్చడాన్ని న్యాయమూర్తులు



తప్పుబడుతూ,త్వరితగతిన నిర్ణయం తీసుకోవలసిందిగా ఆదేశాలివ్వడం ఆహ్వానించదగినదని ఎంపీ వద్దిరాజు అన్నారు.

# ఎన్డీయేకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

విశ్వంభర, చెన్నై: తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట



ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఐవీఎఫ్ కోసం వస్తే సరోగసీ వైపు మళ్లించారు..

# 'సృష్టి' కేసు రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

విశ్వంభర, హైదరాబాద్: సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. "రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం



బయటపడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియన్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారు" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

# అండమాన్ నికోబార్‌లో తొలిసారి 'ఈడీ' సోదాలు!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఈడీ తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారికావడం గమనార్హం. ఓ సహకారబ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపీ కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన మనీలాం డరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు పోర్ట్ బ్లెయిర్ పరిసరా ల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఏఎన్ఎస్‌సీబీ) ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి.. బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను




మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని.. గతంలో బ్యాంకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్‌రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ నెల 18న శర్మను అరెస్టు చేశారు. ఈ నెల 29న కోర్టు ఆయన్ను మూడు రోజుల పోలీసు కస్టడీకి పంపింది.

# ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు సూచనలు మాత్రమే చేసింది: అద్దంకి దయాకర్

విశ్వంభర, హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. "భారత రాష్ట్ర సమితి నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు భారత రాష్ట్ర సమితి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని



బతికించాం. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం"అని అద్దంకి దయాకర్ అన్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీం తీర్పును గౌరవిస్తాం: ఆది శ్రీనివాస్



విశ్వంభర, హైదరాబాద్ః తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. న్యాయస్థానాలు అంటే తమకు గౌరవం ఉందని సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. "రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న %దీ=ా% ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీలను పార్టీలో చేర్చుకుంది. ఆ పార్టీ విధానాలు నచ్చక బయటకు వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ వేసి ప్రభుత్వం కూలిపోతుందని పగటి కలలు కన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఉంటుందని తెలిసినా బీఆర్ఎస్ నాయకులు నానా యాగి చేశారు" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## చుక్కలు చూపించిన చిరుత.. ఎట్టకేలకు బోనులో చిక్కింది

విశ్వంభర, హైదరాబాద్: రాజధాని శివారు గండిపేట, మొయినాబాద్, షేక్‌పేట మండలాల్లో స్థానికులకు నిద్రలేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. దాదాపు 20 రోజులుగా సురక్షిత ప్రాంతాలను ఎంచుకొనే క్రమంలో సంచరిస్తూ అటవీ అధికారులకు సవాల్ విసిరిన చిరుత.. మంచిరేవుల ఫారెస్ట్ టెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. అటవీశాఖ అధికారులు చిరుతను జూపార్క్‌కు తరలించారు.



# "చట్టమా...? న్యాయమా...??



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన ఆదేశాలతో రాష్ట్ర రాజకీయాలు మరో సారి వేడెక్కాయి. కాంగ్రెస్ లో చేరిన తమ పార్టీ ఎమ్మెల్యేలు 10 మందిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో... ఏం జరగబోతుందన్నది... ? చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలోనే కాదు... దేశ రాజకీయాలను, చట్టసభలను కూడా ప్రభావితము చేయగల ఈ తీర్పుపై ప్రభుత్వాలు, స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో... అన్నదానిపై విభిన్న అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. చట్టమా...? న్యాయమా..? ఏది ప్రధానం అన్నదానిపై కూడా చర్చ జరుగుతుంది. మూడు నెలల్లో ఏం జరగబోతుంది? దాని ఫలితం ఎలా ఉండనున్నది... అన్నది తెలంగాణ రాష్ట్రంలోని కాదు దేశవ్యాప్తంగా పార్టీ ఫిరాయింపులు, ఫిరాయింపుదారులపై చర్యల విషయంలో దిశా నిర్దేశం చేయనున్నది. తెలంగాణ రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో పదిమంది కాంగ్రెస్ లో చేరారు. వారిలో కొందరు కాంగ్రెస్ కండువా కప్పుకుంటే... మరికొందరు ఆ పార్టీ కండువా కప్పుకోకపోయినా కాంగ్రెస్ తోటే కలిసి మెలిసి ఉంటున్నారు. ఈ పదిమంది పార్టీని ఫిరాయించిన కారణంగా వారి శాసనసభ సభ్యత్వాలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపతి(స్పీకర్)కి ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది.

పార్టీని ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని మాత్రమే శాసనసభాపతికి సూచించింది. దీనిపై న్యాయ నిపుణుల సలహా తీసుకుంటానని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం వెల్లడించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఆ పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఆ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికలు జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. కానీ, ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, మరికొందరు నిపుణులు చేస్తున్న ప్రకటనలు, వివరణలు, సూచనలు గమనిస్తే ఆ పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాల్సిన అవసరం ఉండదు అనేలా ఉన్నది. ఇదే సందర్భంలో చట్టమా? న్యాయమా?? ఏది ప్రధానం అనే చర్చ జరుగుతుంది. నిజానికి ఈ రెండు ఉన్నతమైనవే. ఒకదానిని కాదని మరొకదానిని గొప్ప అని చెప్పలేం... అలాగని తగ్గించి చూడలేం. కానీ, చట్టం... న్యాయం రెండిటిని పరిశీలన చేసినప్పుడు సందర్భానుసారం మాత్రమే నిర్ణయాలు ఉంటాయి అన్నది గమనించాల్సి ఉంటుంది. చట్టాన్ని అధిగమించినప్పుడు అన్యాయం జరిగిన వారికి న్యాయం జరిగేలా చూడడమే న్యాయవ్యవస్థ ప్రధాన విధి. ఇక్కడ సమస్య ఒక చట్టానికి మాత్రమే పరిమితమై లేదు. ఇటు చట్టాన్ని అయినా అటు న్యాయవ్యవస్థ అయినా రాజ్యాంగానికి లోబడి పని చేయాల్సిందే. చట్టసభల సభ్యుల విషయమై... రాజ్యాంగానికి లోబడి.. సంబంధిత శాసనసభాపతి తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయి. చట్టసభల విషయంలో న్యాయవ్యవస్థ తగు సూచనలు చేస్తుందే తప్ప... అమలు చేయాల్సిందేనని నిర్దేశించ లేదని కొందరు సూచిస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు తాజా తీర్పు కేవలం శాసనసభాపతికి చేసిన సూచన తప్ప.. కోర్టు ధిక్కరణ పరిధిలోకి వెళ్ళబోదు ... ఆన్నది కొందరి వాదన. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందేనని లేనిపక్షంలో కోర్టు ఆదేశాల ధిక్కరణ కిందకే వస్తుంది అన్నది బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పును న్యాయనిపుణులతో సమీక్షిస్తామని స్పీకర్ పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఇటువంటి సంఘటనలు గతంలో ఎప్పుడు ఎక్కడ జరిగాయి? తీసుకున్న చర్యలు ఏవి? అంటూ అనేక సంఘటనలను ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రంలో, అందులోనూ తెలంగాణ రాష్ట్రంలో గతంలో జరిగిన అనేక సంఘటనలు, పర్యవసానాలు, అనుభవాలు తెరపైకి తెస్తున్నారు. 2014 సంవత్సరంలో ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావంతో ఏర్పడిన తొలి ప్రభుత్వాన్ని ఆనాటి ఎన్నికల్లో గెలిచిన టిఆర్ఎస్ (ప్రస్తుత బీ ఆర్ఎస్) ఏర్పాటు చేసింది. టిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపితో పాటు కాంగ్రెస్ నుంచి 21 మంది, టిడిపి నుంచి 15 మంది, బిఎస్పి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలుపొందారు. బీఎస్పీ ఎమ్మెల్యేలు ఇద్దరు టిఆర్ఎస్లో చేరి పార్టీని విలీనం చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలను దశలవారీగా టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. ఇక మిగిలిన కాంగ్రెస్ పార్టీలో ఏడుగురు శాసనసభ్యులను దశలవారీగా టిఆర్ఎస్ లో చేర్చుకున్నారు. ఇలా వేరు వేరు పార్టీల నుంచి టిఆర్ఎస్ పార్టీలో చేరిన శాసనసభ్యుల్లో కొందరికి మంత్రి పదవులు కూడా దక్కాయి. మరికొందరికి ఇతర నామినేటెడ్ పదవులు కూడా లభించాయి. ఇలా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్, టిడిపి పక్షాలు అనేకసార్లు ఆనాటి స్పీకర్ కు ఫిర్యాదు చేసినా ... ఆనాటి అసెంబ్లీ కాల పరిమితిముగిసే వరకు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి 19 మంది, టిడిపి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలిచారు. టిడిపి ఎమ్మెల్యేలు ఇద్దరు కూడా బీఆర్ఎస్ లో చేరారు. కాంగ్రెస్ నుంచి 12 మందిని బీఆర్ఎస్ లో చేర్చుకోవడం తోపాటు కొందరికి మంత్రి పదవి కూడా ఇచ్చారు. అంతేకాదు, కాంగ్రెస్ శాసనసభ పక్షం బీఆర్ఎస్ లో విలీనమైనట్లుగా కూడా పేర్కొన్నారు. మిగిలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రతిపక్ష హోదా లేదని కూడా స్పష్టం చేశారు. ఇప్పుడు ఈ గణాంకాలే అనేక చర్చలకు దారి తీస్తున్నాయి.

చట్టసభలకు ముఖ్యంగా ప్రజా ప్రాతినిధ్య చట్టానికి గల విశేషాధికారాలను పలువురు గుర్తు చేస్తున్నారు. చట్టసభల సభ్యులపై ఎటువంటి నిర్ణయమైనా తీసుకోవాల్సింది సంబంధిత శాసనసభాపతి మాత్రమే. ఈ విషయంలో కోర్టుల జోక్యానికి తావు లేదన్నది చాలామంది వాదన. సమైక్యాంధ్రప్రదేశ్ లో... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం బలంగా సాగుతున్న సమయంలో నాడు టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కొందరు తమ పదవులకు రాజీనామా చేసినా స్పీకర్ ఆమోదించలేదు. ఇతర పార్టీల నుంచి చేసిన రాజీనామాలకు కూడా వెంటనే ఆమోదం తెలపలేదు. నిర్ణీత గడువుతో సంబంధం లేకుండా స్పీకర్ విచక్షణతో మాత్రమే వ్యవహరించారు. ఇప్పుడు కూడా స్పీకర్ నిర్ణయమే ఫైనల్... అని కొందరు సూచిస్తున్నారు.

కోర్టు తీర్పు నేపథ్యంలో ఎమ్మెల్యేల అనర్హత విషయమై బీఆర్ఎస్ చేస్తున్న వాదనపై... విమర్శలు వస్తున్నాయి. ఆ పార్టీ మొండిగా వ్యవహరిస్తే... అధికారపక్షం మరికొంత దూకుడుగా వెళ్లి... బీఆర్ఎస్ కు మరింత నష్టం చేకూర్చే ప్రమాదం లేకపోలేదన్నది కొందరి అభిప్రాయంగా ఉన్నది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం... ఒక పార్టీకి చెందిన చట్టసభ సభ్యుల్లో... మూడో వంతు చీలిపోతే వారిని ప్రత్యేక వర్గంగా గుర్తించవచ్చు. మూడింట... రెండు వంతుల మంది చీలిపోతే ... ఆ వర్గాన్ని ఆ పార్టీ శాసనసభ పక్షంగా కానీ... లేదా ఆ సభ్యులు కోరితే మరో పార్టీలో విలీనమైనట్లుగా కానీ ప్రకటించవచ్చు. ఈ రెండు ఘటనలకు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాలే నిదర్శనం. అప్పట్లో ఏడుగురు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా వారిని ప్రత్యేక గ్రూపుగా పేర్కొంటూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 2018 తర్వాత అయితే ఏకంగా కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారిని బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు. కాంగ్రెస్ బలం 19 కాగా మూడింట రెండు వంతుల పేరిట కాంగ్రెస్ నుంచి వచ్చిన 12 మందిని బీఆర్ఎస్ లోకి వెళ్లారు. ఇప్పుడు ఆ నిబంధనల ప్రకారం అయితే, బీఆర్ఎస్ మరింత ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. స్పీకర్ నిర్ణయం అటు ఉంచితే...

ఈ సంక్షోభాన్ని అధిగమించే పరిస్థితులు కాంగ్రెస్ కు మరికొంత మెరుగ్గా ఉంటాయని చెప్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో బీఆర్ఎస్ కు 38 మంది శాసనసభ్యులు ఉన్నారు. వారిలో మూడవ వంతు అంటే 13 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి వేరుపడినట్టుగా స్పీకర్ కు విన్నవిస్తే అసెంబ్లీలో వారిని ప్రత్యేక గ్రూపుగా గుర్తించవచ్చు. అంటే, ప్రస్తుతం ఉన్న పదిమంది ఫిరాయింపుదారులకు తోడు మరో ముగ్గురు ఎమ్మెల్యేలు జతకడితే వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీలు ఉండదు. గతంలో బీఆర్ఎస్ అనుసరించిన విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ కూడా అనుసరించాలని భావిస్తే.. మూడింట రెండు వంతులు 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కటైతే... వారిని ప్రధాన పక్షంగా గుర్తించే వీలుంటుంది. అంతేకాదు, వారు కోరుకుంటే కాంగ్రెస్ పక్షంలోనూ విలీనం చేయవచ్చు. వీటిలో ఏది జరిగినా... మాఆర్ఎస్ కు తీవ్ర నష్టమే. పైగా అధికారపక్షంపై కానీ, శాసనసభాపతి పై గానీ విమర్శలు చేసే పరిస్థితులు ఆ పార్టీకి ఉండవు. గతంలో ఇవే పద్ధతులను బీఆర్ఎస్ అనుసరించింది. "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష" అన్నట్లు బీఆర్ఎస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారే పరిస్థితి లేకపోలేదు... అని మరికొందరు పేర్కొంటున్నారు. మూడు నెలల్లో ఏం జరగబోతుందో....? వేచి చూడాల్సిందే.




బాశెట్టి శ్రావణ్ కుమార్,
సీనియర్ జర్నలిస్ట్.
7207201154

## ఆదేశమే కానీ..
### అంతిమ తీర్పు మాత్రం కాదు




ముందు ముందు ఇంకా చాలా కథ ఉన్నది. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు అవకాశాలు చాలా పరిమితం.తీర్పుపై విస్తృత ధర్మాసనానికి అప్పీలుకు వెళ్లే, వెళ్లగలిగే అవకాశం, హక్కు స్పీకర్ వ్యవస్థకు ఉన్నది. ఆ హక్కును వినియోగించుకునే అవకాశమే ఎక్కువ. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు మరో పార్టీలోకి ఫిరాయించడంపై సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పులో న్యాయం కనిపిస్తున్నది.తెలంగాణకు చెందిన బీ. ఆర్.ఎస్. పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు ఈ తీర్పు నిచ్చింది. ఫిరాయింపుపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారనేది పిటిషన్ లోని స్థూలమైన విషయం. తాత్సారం సరైంది కాదని కోర్టు పేర్కొంది. ఫిరాయింపుపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవలసింది స్పీకర్ ను కోర్టు ఆదేశించింది .అవకాశ వాద రాజకీయాలు చేసే "నేతాశ్రీ"లకు ఈ తీర్పు ఒక చెంపపెట్టు లాంటిది. రాజకీయాలను పచ్చి వ్యాపారంగా మార్చి వేసిన "నేతాశ్రీ" లకు ఈ తీర్పు ఏ మాత్రం మింగుడు పడనిది. ప్రజాస్వామిక వాదులు సంతోషించే స్వాగతించే తీర్పు. ఇప్పుడున్న పాక్షిక ప్రజాస్వామ్యాన్ని కొంత మేరకు కాపాడగలిగేది. కానీ... అమలు అవకాశం చాలా పరిమితం. సరిగ్గా చెప్పాలంటే అవకాశం లేదనే చెప్పాలి. స్పీకర్ కుర్చీ అనేది రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ.దాని అధికార పరిధిలో మరో సంస్థ జోక్యం చేసుకునే అధికారం జ్యుడిషియరీకి లేదు.స్పీకర్ "విచక్షణ"ను ప్రశ్నించే అధికారం ఇతర ఏ రాజ్యాంగ వ్యవస్థకూ లేదు. చట్ట సభల అధ్యక్షులకు రాజ్యాంగం ఇచ్చిన సదరు "విచక్షణ" ఇక్కడ ఒక బ్రహ్మ పదార్థం. దాన్ని ఎవరూ నిర్వచించలేరు. దానికి ఎలాంటి కాలపరిమితీ లేదు.స్పీకర్ కు రాజ్యాంగం ఇచ్చిన ఈ విచక్షణాధికారం ఫిరాయింపుదారులు, రాజకీయ వ్యాపారులు, అవకాశ వాద "నేతాశ్రీ" లకు ఒక వజ్ర కవచం లాంటిది. ఈ కవచాన్ని ఛేదించే అస్త్రం న్యాయ వ్యవస్థ వద్ద లేదు. అదే ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనత."నేతాశ్రీ" ల బలం. దేశంలో ఇదే తొలి ఫిరాయింపు ఏమీ కాదు. ఇలాంటివి ఇంతకు ముందు అనేకం జరిగాయి. ప్రజలు ఒక పార్టీకి అనుకూలంగా తీర్పునిస్తే ఆ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను చీల్చి ప్రభుత్వాలను కూల్చివేసి ఆ ప్రజలే తిరస్కరించిన పార్టీ ప్రభుత్వాలు ఏర్పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. ఫిరాయింపు నిరోధక చట్టంలోని సాంకేతికమైన ఒక లొసుగు సదరు చీలికకు చట్టబద్ధమైన ఊతమిస్తున్నది. అలాంటివి ఇటీవలి కాలంలో చాలానే జరిగాయి. దేశంలోని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఆ లొసుగును అడ్డుపెట్టుకొని కొనసాగుతున్నవే. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఇలాంటి చిత్రమైన బూటకపు విన్యాసాలను మొత్తం ప్రపంచం నిస్సహాయంగా, చేష్టలుడిగి గుడ్లప్పగించి చూసింది. చూస్తూనే ఉన్నది. ఇదీ ఇక్కడ అతి ఘనంగా వర్ధిల్లుతున్నదని చెబుతున్న "ప్రజాస్వామ్యం".




-గండె గోవర్ధన్

## సాహితీ సాంస్కృతిక స్వర్ణ యుగంలా భాసిల్లిన రెడ్డి రాజుల కాలం



గ్రంథాలను ఆమూలాగ్రంగా అప్పటి పండితులు అభ్యసించారు. రెడ్డి రాజుల నుండి శ్రీనాథ కవి సార్వభౌముడు, ఆయన శిష్య వర్గం బహుళ ఆదరణ, ప్రశంసలను, మెప్పులను పొందారు. కవుల ఉద్దండ పండితుల సాహితీ సేవలకు మెచ్చి రెడ్డి రాజులు వారికి అగ్రహారాలు కానుకలుగా ఇచ్చారు. సాహిత్యాన్నే కాక సంగీత నాట్యాలను కూడా వీరు సమంగా, సమర్ధవంతంగా ఆదరించి పోషించారు. సంగీత నాట్యాచారులను వీరు పెంచి పోషించారు. "కర్పూర వసంతోత్సవాలు" నిర్వహించి ఆనాడు భారత దేశంలోనే ఖ్యాతి గడించారు. ఆనాటి కాలంలో పర్షియా దేశపు నృత్య రీతులను తెలుగు నేలలో బహుళ ఆదరణ పొందాయి. శ్రీనాథుడు ఎర్రా ప్రెగ్గడ కళా ప్రియులు. నిశ్శంక కొమ్మన అనుకవి శివ లీలా విలాసాన్ని రచించాడు. వామన భట్ట బాణుడు సంస్కృతంలో "వేమ భూవరుని చరిత్ర" రాశాడు. కుమారగిరి రెడ్డి "వసంత రాజీయం" అనే నాట్య శాస్త్ర గ్రంథాన్ని, పెదకోమటి వేమారెడ్డి నాట్యశాస్త్రం "సాహితీ చింతామణి"ని రచించాడు. కాటయ వేమారెడ్డి "కాళిదాసు నాటక వ్యాఖ్యలు" రచించాడు. పెదకోమటి వేమారెడ్డి తన నాట్య శాస్త్ర గ్రంథంలో 'మత్తల్లి' నర్తనను వర్ణించాడు. ఇక కుమారగిరి రెడ్డి ఆస్థానంలో 'లకుమ' ఆస్థాన నర్తకి గా ఉండింది. లకుమ నాట్య శాస్త్రంలోని కొత్త రీతులను ప్రవేశపెట్టింది. ఈమె భరతనాట్య శాస్త్ర విశారదగా పేరుపొందింది. రెడ్డి రాజుల కాలంలో భరతనాట్యానికి తోడుగా దేశీయ నృత్యాలు వ్యాప్తిలోకి వచ్చాయి. పేరిణి, జక్కిని, చిందులాటలు నాట్య రీతులు వీటిలో కొన్ని కాహళము, ఢక్కజయగంట భేరి వంటి వాయిద్యాలను నాట్యకారులు ఉపయోగించేవారు.

సంగీత, నాట్య, సాహిత్యాలలో ప్రావీణ్యత కలవారిని రెడ్డి రాజులు గుర్తించి తగురీతిలో సత్కరించేవారు. విధ్వత్సభలు నిర్వహించి కళాకారులను పండితులను తమకు తోచిన రీతిలో సన్మానాలు చేసేవారు. వేద, వేదాంగ, పురాణేతిహాస, కావ్య, నాటక, అలంకార, నీతి, ధర్మ, సాంఘిక, యుద్ధ, శాస్త్ర, శస్త్ర, సంగీత, భరతనాట్యాలు నేర్చిన వారికి, పండితులు, కవులు, శాస్త్రజ్ఞులు, విప్రులు, ఆచార్యులు మొదలగు వారికి గౌరవాదరాలు బాగా లభించేవి.

### ఆయుర్వేద, వైద్య, ధర్మ, తర్క మీమాంస, న్యాయ శాస్త్రాలకు గొప్ప ఆదరణ..

ఆయుర్వేద, వైద్య, ధర్మ శాస్త్ర, తర్క, మీమాంస, న్యాయ శాస్త్రాలకు రెడ్డి రాజుల కాలంలో గొప్పగా ఆదరణ లభించేది. బాల సరస్వతి, త్రిలోచనాచార్యులు అనవేమారెడ్డి, అనపోతారెడ్డి సభల్లో ఆస్థాన పండితులు. ప్రోలయ వేమారెడ్డి సంస్కృత భాషా కోవిదుడు. భరత శాస్త్రాన్ని కూలంకషంగా అభ్యాసం చేసి 'వసంత రాజీయం' అనే నాట్య శాస్త్రాన్ని వెలువరించిన గొప్ప రచయిత. రాజమహేంద్రవర రాజ్యాధిపతి కాటయవేమారెడ్డి 'భాషా వర్ణము' నందించిన గొప్ప పండితుడు. కాళిదాసు నాటకాలకు గొప్ప వ్యాఖ్యలు రాసి, వాటికి తన బావమరిది పేరు జోడించి 'కుమారగిరి రాజీయం'గా వెలయించాడు. 'సప్తశతీసారటీక' అమరుక కావ్యానికి శృంగార దీపిక అను టీకా, సంగీత చింతామణి, సాహిత్య చింతామణి, లాంటి గొప్ప గ్రంథాలను పెదకోమటి వేమారెడ్డి రచించాడు. కవిసార్వభౌమ, సాహిత్య చూడామణి, బిరుదాంకితులు వామనభట్టు బాణుడు పెదకోమటి వేమారెడ్డి కాలంలోనివారే. ఉషా పరిణయము, పార్వతీ పరిణయము నాటకాలు. హంస సందేశము, రఘునాథాభ్యుదయము కావ్యాలు. వేమ భూపాల చరిత వచన కావ్యం. శబ్ద చంద్రిక, శబ్ద రత్నాకర నిఘంటువులను వామన భట్టుబాణుడు రచించాడు. శంభుదాసు, ప్రబంధ పరమేశ్వరుడు అనే బిరుదులు పొందిన ఎర్రా ప్రెగ్గడ ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవిగా ఉండేవారని తెలుస్తుంది.

సంగీత, సాహిత్య, నాట్య, శిల్ప కళలలో ప్రావీణ్యత కలవారిని రెడ్డి రాజులు గుర్తించి సత్కారాలు చేసేవారు. విద్వత్సభలు నిర్వహించి, కళాకారులను, పండితులను తమకు తోచిన రీతిలో సన్మానాలు చేసేవారు. వేద, వేదాంగ, పురాణ,ఇతిహాస, కావ్య, నాటక, అలంకార, నీతి, ధర్మ, సాంఘిక, యుద్ధ, శాస్త్ర, శస్త్ర, సంగీత, భారత నాట్యాలు నేర్చిన వారికి, పండితులు, కవులు, శాస్త్రజ్ఞులు, విప్రులు, ఆచార్యులు మొదలగు వారికి గౌరవాదరాలు బాగా లభించేవి. ఆయుర్వేద, వైద్య, ధర్మశాస్త్ర, తర్క, మీమాంస, న్యాయ శాస్త్రాలకు రెడ్డి రాజుల కాలంలో గొప్ప ఆదరణ లభించేది.

రెడ్డి రాజుల యుగంలో సాహితీ సాంస్కృతిక సౌరభాల పరిమళాల గుభాలింపు ఎంతో వ్యాప్తి చెందాయి. రెడ్డి రాజులు కవి పండితులను చక్కగా పోషించారు. వారి కాలంలో చిత్రకళలు, శిల్పం, సంగీత, నాట్యాలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. రెడ్డి రాజుల యుగంలో సాహిత్యం స్వర్ణ యుగల్లా భాసించింది. ఆ కాలంలో సాహిత్యం వారి అపూర్వ ఆదరణకు నోచుకున్నాయి అంటే వారికి సాహిత్యం పై ఉన్న మమకారం కాక మరో కారణంగా వారు స్వయంగా సాహితీవేత్తలుగా సాహితీస్రష్టలుగా ఉండటమే ఒక విశేషంగా మనం చెప్పుకోవచ్చు. తెలుగు భాష రెడ్డి రాజుల కాలంలో అత్యున్నత స్థాయిని అందుకుంది. అంతేకాక సంస్కృతాంధ్ర భాషలకు పెదకోమటి వేమారెడ్డి కాలం స్వర్ణ యుగంగా పరిఢవిల్లినది. వీరి కాలంలో అవధానాలు, గర్భగోప్య రమ్యత కల అక్షర వన్నె కలిగిన కవితలు, గ్రంథాలు ఎన్నో వచ్చాయి. అష్టభాషా కోవిదులు మాత్రమే రెడ్డి రాజుల ఆస్థానంలో విధ్వంసులయ్యారు. చతుర్వేదాలు, శిక్ష, కల్ప, జ్యోతిష్య, నిరుక్త, వ్యాకరణ, చందశ్శాస్త్రం, మీమాంస తత్వశాస్త్రాలలో ప్రావీణ్యత సంపాదించారు. అంతేకాక ఆనాటి కాలంలో పండితులు సంస్కృతం, తెలుగు, పారసీ, అరబ్బీ భాషల్లో నిష్ణాతులై ఉండేవారు. శ్రీనాథ కవి సార్వభౌముడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉండేవారు. విద్యాధికారిగా కవి పండితులను, కళావేత్తలను ఆయన నియమించేవారు. ఆనాటి కాలంలో పారశీక భాషా ప్రభావం తెలుగు భాష పై ఎక్కువగా ఉండేదని తెలుస్తుంది.

### సంగీత సాహిత్య నాట్య కళలకు సమాదరణ..

ఆ కాలంలోని పండితులు శక, సింధు, సౌవీర, బర్బర, కరహాట భాషలు కూడా వచ్చినవారు. రామాయణ, భారత, భాగవత ఇతిహాస

### చిత్ర బంధ కవితల వ్యాప్తి, మహాభారత ఆంధ్రీకరణ పూర్తి..

రామాయణ కావ్యం, హరివంశ మహాకావ్యం, నన్నయ, తిక్కన మహాకవులు వదిలివేసిన మహాభారతంలోని భారతారణ్య పర్వాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వారి రచన శైలికి అనుగుణంగా ఎర్రా ప్రెగ్గడ పూర్తి చేశాడు. నృసింహ పురాణం గ్రంథ రచనలో ప్రబంధ రచనలకు వర్ణనలకు అత్యంత ప్రాధాన్యతతో ఆ మిగిలిన పర్వాలను పూర్తిచేసి మహాభారతానికి ఒక రూపు తెచ్చాడు. కావ్యాలంకార చూడామణి, శివ లీలా విలాసం అనే గ్రంథాలను, విన్నకోట పెద్దన్న రచించాడు. శ్రీనాథుడు తన శైలిలో శృంగార నైషధం వంటి శృంగార ప్రబంధంతో పాటు అటు రక్తి ఇటు భక్తి అనే రీతిన హరవిలాసం, కాశీఖండం, భీమఖండం, శివరాత్రి మహాత్మ్యం వంటి గ్రంథాలను రచించాడు. తెలుగు భాషను సుసంపన్నం చేస్తూ తనతోపాటు రెడ్డి రాజుల జీవితాలను కూడా ధన్యత చెందునట్లుగా, శృంగారకవిగా, కవి సార్వభౌముడిగా కీర్తి గడించిన శ్రీనాథ కవి సార్వభౌముడు తన చివరి కాలంలో అష్ట కష్టాలకు గురయ్యాడు. శ్రీనాథుడు మరికొన్ని గ్రంథాలు కూడా రచించాడు శాలివాహన సప్తశతి, మరుత్తరాట్చరిత్ర, పలనాటి వీర చరిత్ర ద్విపద కావ్యం రచించాడు. జక్కన విక్రమార్క చరిత్ర, అనంతమాత్యుని భోజరాజీ యం, దగ్గుపల్లి దుగ్గన కాంచీ మహాత్మ్యం ఇతర గ్రంథాలు రెడ్డి రాజుల కాలంలోనే వచ్చాయి వీరి కాలంలో చిత్రబంధ కవితలు బాగా వ్యాప్తిలో ఉన్నాయి. రెడ్డి రాజులు విద్యా వివేక వినయ సంపన్నులు. సంస్కృతాంధ్ర భాషలలో నిష్ణాతులు కవులను వీరు ఆదరించి పోషించారు. ఈ విధంగా రెడ్డి రాజుల కాలం సాహితీ సాంస్కృతిక రంగాలకు స్వర్ణ యుగ వైభవం అనటంలో ఇసుమంతయును సందేహం అవసరం లేదు.



"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు
భాగ్యనగరం, 9705100788

# చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్..



విశ్వంభర, స్పోర్ట్స్ః
ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఓవల్ మైదానంలో ఇంగ్లాండ్, భారత్ మధ్య చివరి టెస్టు ప్రారంభమైంది. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియా కెప్టెన్ గిల్ ఓ రికార్డును బ్రేక్ చేశాడు. ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. సునీల్ గావస్కర్ 1978/79లో వెస్టిండీస్‌పై 732 పరుగులు చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును గిల్ (743) బ్రేక్ చేశాడు.
ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్లు
743 – శుభ్‌మన్ గిల్ (ఇంగ్లాండ్‌పై) 2025
732 – సునీల్ గావస్కర్ (వెస్టిండీస్‌పై) 1978/79
655 – విరాట్ కోహ్లీ (ఇంగ్లాండ్‌పై) 2016/17
610 – విరాట్ కోహ్లీ (శ్రీలంకపై) 2017/18
593 – విరాట్ కోహ్లీ (ఇంగ్లాండ్‌పై) 2018

# ఇంగ్లాండ్ రివ్యూను కాపాడిన అంపైర్!

## ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నెటిజన్లు



విశ్వంభర, స్పోర్ట్స్ః ఇంగ్లాండ్, భారత్ మధ్య ఓవల్ మైదానంలో ఐదో టెస్టు జరుగుతోంది. టాస్ ఓడి టీమ్‌ఇండియా బ్యాటింగ్‌కు దిగింది. 23 ఓవర్ల ఆట తర్వాత వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. అప్పటికి భారత్ స్కోరు 72/2. సాయి సుదర్శన్ (25బి), శుభ్‌మన్ గిల్ (15బి) క్రీజులో ఉన్నారు. అయితే, ఈ మ్యాచ్‌కు ఆన్‌ఫీల్డ్ అంపైర్లలో ఒకరైన కుమార్ ధర్మసేనపై నెటిజన్లు ఫైరవుతున్నారు. ఇంగ్లాండ్ ఒక రివ్యూను కోల్పోకుండా కాపాడటమే ఇందుకు కారణం.అసలేం జరిగిందంటే.. జోష్ టంగ్ వేసిన 13వ ఓవర్‌లో రెండో బంతిని సాయి సుదర్శన్ ఎదుర్కొన్నాడు. ఇన్‌స్వింగ్ యార్కర్‌గా వచ్చిన ఈ బంతిని ఆడే క్రమంలో సాయి సుదర్శన్ కిందపడ్డాడు. అయితే, బంతి బ్యాట్‌కు తాకింది. ఈ విషయాన్ని గమనించని ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశారు. కానీ, అంపైర్ కుమార్ ధర్మసేన 15 సెకన్ల డీఆర్ఎస్ టైమర్ ముగియక ముందే బంతి ఇన్‌సైడ్ ఎడ్జ్ అయిందని తన చేతి వేళ్లతో సంజ్ఞ చేశాడు. దీంతో ఇంగ్లాండ్ రివ్యూకు వెళ్లలేదు. ఒకవేళ ఇంగ్లిష్ జట్టు డీఆర్ఎస్ కోరితే ఒక రివ్యూను కోల్పోయేది. అంపైర్ సంజ్ఞ చేయడంతో ఇంగ్లాండ్ రివ్యూ తీసుకోలేదని, అంపైర్లు ఇలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# ఈ సిరీస్ ఫలితం..
# గంభీర్ భవిష్యత్తుకు అత్యంత కీలకం



విశ్వంభర, స్పోర్ట్స్ః ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 1–2 తేడాతో వెనుకబడి ఉంది. ఆఖరి టెస్టు మిగిలిన నేపథ్యంలో.. సిరీస్‌ను సమం చేయాలని టీమ్‌ఇండియా సర్వశక్తులొడ్డుతోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ భవిష్యత్తుకూ ఇదే కీలకమని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైకెల్ అథర్టన్ వ్యాఖ్యానించాడు. తమ జట్టు గెలవాలని కోరుకోవడంలో తప్పేలేదని.. వరుసగా మూడో సిరీస్‌ను కోల్పోతే మాత్రం గంభీర్‌కు కష్టాలు తప్పవని హెచ్చరించాడు.ఇప్పటికే భారత్ వరుసగా రెండు టెస్టు సిరీస్‌లను ఓడింది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. ఇక ఆస్ట్రేలియాలోనూ సిరీస్ కోల్పోవాల్సి వచ్చింది. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీని 3–1 తేడాతో చేజార్చుకుంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లోనూ భారత్ ఓటమిపాలైతే మాత్రం ఇంగ్లాండ్‌కే సిరీస్ వశమవుతుంది. అప్పుడు కోచ్‌గా గంభీర్‌పై తీవ్ర ఒత్తిడి తప్పదు. హ్యాట్రిక్ ఓటములను ఎవరూ హర్షించరు” అని మైకెల్ తెలిపాడు.

**ఆగ్రహం తప్పదు..**
“భారత్‌లో వనరులకు తక్కువేం లేవు. అలాగే ప్రజా బలం కూడా చాలా ఎక్కువ. అయితే, ఇతర జట్లతో పోలిస్తే వారికి ఎక్కువ ఓపిక ఉండదు. ప్రతి మ్యాచ్‌లోనూ గెలవాలని కోరుకుంటారు. అందులో తప్పేమీ లేదు. అందుకే, ఈ సిరీస్‌ను భారత్ కోల్పోకుండా ఉంటేనే గంభీర్‌కు బెటర్. ఒకవేళ ఇందులోనూ ఓడితే మాత్రం అతడికి పెద్ద సమస్యే అవుతుంది. అభిమానుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. అతడి కోచ్ భవితవ్యంపైనా చర్చ జరిగే అవకాశం లేకపోలేదు” అని అథర్టన్ వ్యాఖ్యానించాడు.

# లార్డ్స్ టెస్టులో బాల్ ఛేంజ్ వివాదం..
# ఐసీసీకి ఫిర్యాదు చేసిన టీమిండియా!



విశ్వంభర, లార్డ్స్: ఇండియా, ఇంగ్లండ్మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌లో గురువారం నుంచి అయిదో టెస్టు ప్రారంభమైంది. అయితే లార్డ్స్‌లో జరిగిన కీలకమైన మూడవ టెస్టులో వివాదస్పద ఘటన చోటుచేసుకున్నది. బంతిని మార్చే అంశంలో వివాదం చెలరేగినట్లు టీమిండియా ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఐసీసీకి ఫిర్యాదు కూడా చేసింది. ఆ టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న సమయంలో.. పది ఓవర్లకే బంతి షేప్ మారింది. ఆకారం చెడి పోవడంతో మరో బంతి తీసుకోవాల్సి వచ్చింది. అయితే రీప్లేస్‌మెంట్‌లో భాగంగా అంతే పాత బంతిని అంపైర్లు ఇవ్వాలి. కానీ ఇక్కడ తప్పు జరిగినట్లు టీమిండియా క్రికెటర్లు ఆరోపిస్తున్నారు.పది ఓవర్ల బంతి స్థానంలో 35 ఓవర్లు ఆడిన పాత బంతిని ఇచ్చినట్లు పేర్కొన్నారు. బంతి మరీ పాతది కావడం వల్ల.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లను ఈజీగా ఔట్ చేయలేకపోయారు. అప్పటి వరకు ఆధిపత్యం చాటిన ఇండియా.. 35 ఓవర్లు ఆడిన బంతిని తీసుకోవడం వల్ల స్మిత్‌ను ఈజీగా ఔట్ చేయలేకపోయింది. దీంతో అతను చెలరేగిపోయాడు.వాస్తవానికి 10 ఓవర్లకు చెడిన బంతి స్థానంలో.. అంతే పాత బంతిని ఇవ్వాలి. కానీ టీమిండియా అభ్యర్థనను ఇంగ్లండ్ పట్టించుకోలేదని తెలుస్తోంది. రెండో బంతి తీసుకున్న తర్వాత స్వింగ్ లేకపోవడం వల్ల.. ఓ దశలో 10 ఓవర్లు వాడిన బంతినే ఇవ్వాలని అడిగారు. కానీ ఐసీసీ రూల్స్ ప్రకారం ఆ రిక్వెస్ట్ వర్కౌట్ కాలేదు.పది ఓవర్లు ఆడిన బంతి సగటున 1.869 డిగ్రీల స్వింగ్, 0.579 డిగ్రీల సీమ్ మూమెంట్ ఇస్తోంది. కానీ రిప్లేస్మెంట్ బంతికేవలం 0.855 డిగ్రీల స్వింగ్ మాత్రమే ఇచ్చినట్లు టీమిండియా ఫిర్యాదు చేసింది.ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 రన్స్ తేడాతో నెగ్గిన విషయం తెలిసిందే. దాంతో సిరీస్‌లో 2–1 తేడాతో ఆధిక్యాన్ని సాధించింది. ఇక నాలుగవ టెస్టు డ్రా అయ్యింది.

# 15వ సారి టాస్ ఓడిన టీమిండియా..



విశ్వంభర, స్పోర్ట్స్ః అంతర్జాతీయ మ్యాచుల్లో టీమిండియా వరుసగా 15వ సారి టాస్‌ఓడింది. ఇవాళ ఓవల్‌లో ఇంగ్లండ్‌తో ప్రారంభమైన అయిదో టెస్టులోనూ శుభమన్ గిల్ టాస్ ఓడిపోయాడు. ఈ సిరీస్‌లో అయిదు మ్యాచుల్లోనూ అతను టాస్‌ను కోల్పోయాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి వరుసగా ఇండియా 15 టాస్‌లను ఓడింది. క్రికెట్ చరిత్రలో ఇదో కొత్త రికార్డు. ఓ జట్టు వరుసగా అన్ని సార్లు టాస్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. 32,768 సార్లకు ఒకసారి ఇలా జరిగినట్లు విశ్లేషకులు అంచనా వేశారు. అంటే 0.003 శాతం ఇలా జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. రోహిత్ శర్మ నుంచి కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన గిల్.. ఇంగ్లండ్ సిరీస్‌లో వరుసగా అయిదు టెస్టుల్లో టాస్ ఓడాడు. అంతకముందు అంతర్జాతీయ మ్యాచుల్లో ఇండియా రెండు టీ20, 8 వన్డేల్లోనూ టాస్‌ను కోల్పోయింది. అయితే 5 టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ఓ జట్టు అన్నింటిలో టాస్‌ను కోల్పోవడం ఇది 14వసారి. 2018లో ఇంగ్లండ్‌లో టూర్ చేసిన ఇండియా అన్ని మ్యాచుల్లో టాస్ ఓడింది.

# మళ్లీ విఫలమైన జైస్వాల్..



విశ్వంభర, స్పోర్ట్స్ః ఇండియన్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ మళ్లీ విఫలమయ్యాడు. ఓవల్‌లో జరుగుతున్న అయిదో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అతను కేవలం రెండు పరుగులకే నిష్క్రమించాడు. గస్ అట్కిన్‌సన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ ఔట్ అయ్యాడు. ఫుల్ లెన్త్ బంతి.. నేరుగా అతని ప్యాడ్స్‌కు తగిలింది. అయితే వాస్తవానికి ఆన్ ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇవ్వలేదు. దీంతో ఇంగ్లండ్ రివ్యూకు వెళ్లింది. థార్డ్ అంపైర్ ఔట్ ఇచ్చాడు. లెగ్ స్టంప్‌ను బంతి తగులుతున్నట్లు రిప్లేలో అనిపించింది.చివరి రెండు మ్యాచుల్లో రెండు సార్లు డకౌట్ అయ్యాడు జైస్వాల్. మాంచెస్టర్ మ్యాచ్‌లో అతను 58 స్కోర్ చేశాడు. దీని ఫలితంగా అతని టెస్టు ర్యాంకింగ్ కూడా పడిపోయింది. ప్రస్తుతం తాజా ర్యాంకింగ్స్ ప్రకారం జైస్వాల్ 8వ స్థానంలో ఉన్నాడు. 769 రేటింగ్ పాయింట్లతో 8వ స్థానానికి దిగజారాడు.

# దిగి వస్తున్న బంగారం, వెండి ధరలు..



విశ్వంభర, బిజినెస్ః పసిడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. రూపాయి బలపడడంతో పుత్తడి ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల బంగారంపై రూ.500 తగ్గి తులానికి రూ.98,520కి చేరింది. 22 క్యారెట్ల బంగారంపై రూ.400 తగ్గి తులానికి రూ.97,800కి పనతమైందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. బంగారం బాటలోనే వెండి ధర సైతం భారీగానే పతనమైంది. రూ.2వేలు తగ్గి కిలోకు రూ.1.12లక్షలకు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25శాతం సుంకాలు విధించిన ప్రపంచ మార్కెట్‌లో రూపాయి బలపడడం విశేషం. డాలర్‌తో పోలిస్తే 22 పైసలు బలపడి 87.58 వద్ద ముగిసింది. ఆగస్టు 1 గడువుకు ముందు వాణిజ్య ఒప్పందం కుదరకపోతే భారత వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తామని అమెరికా ప్రకటించిన తర్వాత బుధవారం రూపాయి 87.80 వద్ద ముగిసిన విషయం తెలిసిందే.

## వివో నుంచి కొత్త ఫోన్.. టీ4ఆర్ 5జీ

విశ్వంభర, బిజినెస్ః టీ సిరీస్‌లో వివో మరో కొత్త మొబైల్‌ను తీసుకొచ్చింది. వివో టీ4ఆర్ 5జీ పేరిట దీన్ని విడుదల చేసింది. మీడియాటెక్ డైమెన్సిటీ 7400 ప్రాసెసర్, 50 ఎంపీ రేర్ కెమెరా సెటప్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చారు.వివో టీ4ఆర్ 5జీలో 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేటు, 1,800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్ 15 ఆధారంగా పనిచేస్తుంది. ఇందులో మీడియాటెక్ డైమెన్సిటీ 7400 ప్రాసెసర్ ఇచ్చారు. 5,700 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తోంది. ఇది 44W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.కెమెరా విషయానికొస్తే.. ఈ ఫోన్ వెనకభాగంలో 50 ఎంపీ సోనీ IMX882 ప్రధాన కెమెరా, 2 ఎంపీ బొకే కెమెరా ఇచ్చారు. 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 4కె వీడియో రికార్డింగ్‌తో వస్తోంది. ఇది బ్లూ, సిల్వర్ కలర్స్‌లో లభిస్తుంది.వివో టీ4ఆర్ 5జీ మూడు వేరియంట్లలో అందుబాటులోకి రానుంది. 8జీబీ ం 128జీబీ వేరియంట్ ధర 19,499తో ప్రారంభంకానుంది. 8జీబీం265జీబీ వేరియంట్ ధర రూ.21,499 కాగా.. 12J;+256J; ధర రూ.23,499గా కంపెనీ నిర్ణయించింది. ఈ ఫోన్ ఆగస్టు 5 నుంచి అందుబాటులోకి రానుంది. వివో అధికారిక వెబ్‌సైట్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్‌ల్లో కొనుగోలు చేయొచ్చు.

# ట్రంప్ సుంకాలు.. రెండో సెషన్‌లో
# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



విశ్వంభర, బిజినెస్ః ముంబయి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల ప్రకటనతో దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆగస్టు 1 నుంచి భారత్‌పై 25 శాతం టారిఫ్‌తో పాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేపడుతున్నందున పెనాల్టీలు కూడా విధిస్తామని ప్రకటించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆరంభంలో భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరికి మోస్తరు నష్టాలతో గట్టెక్కాయి. అయితే, ఇంట్రాడే కనిష్ఠాల నుంచి దాదాపు 1100 పాయింట్ల మేర సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎటెర్నల్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.ట్రంప్ టారిఫ్‌ల ప్రకటనతో ఉదయం సెన్సెక్స్ 80,695.50 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,481.86) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత కోలుకుని ఓ దశలో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 81,803.27 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 296.28 పాయింట్ల నష్టంతో 81,185.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.70 పాయింట్ల నష్టంతో 24,786.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.58గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటెర్నల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.66 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,358 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# వన్నె తగ్గుతోన్న పసిడి..
# ఐదేళ్ల కనిష్ఠానికి డిమాండ్..!



విశ్వంభర, బిజినెస్ః అధిక ధరల కారణంగా పసిడి వన్నె తగ్గుతోంది 2025లో బంగారం వినియోగం ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోనుందని ప్రపంచ స్వర్ణ మండలి గురువారం వెల్లడించింది. పసిడి పెట్టుబడుల్లో స్వల్ప డిమాండ్ ఉన్నప్పటికీ.. పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వినియోగదారు అయిన భారత్‌లో ఈ ఏడాది గోల్డ్ డిమాండ్ 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చని అంచనా వేసింది. ఇది 2020 నాటి కనిష్ఠస్థాయి కావడం గమనార్హం. గతేడాది బంగారం గిరాకీ 802.8 టన్నులుగా ఉందని స్వర్ణమండలి రీజినల్ సీఈఓ సచిన్ జైన్ వెల్లడించారు. ధరలు స్థిరంగా ఉంటే.. 2025లో డిమాండ్ 700 టన్నుల వరకూ ఉండొచ్చని, అయితే భౌగోళిక, రాజకీయ అంశాల ప్రభావంతో అది సాధ్యం కాకపోవచ్చని చెప్పారు. జూన్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం (%+శ్రీశ్రీ౹న%) ధర లక్ష దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 28 శాతం పెరుగుదల కనిపించింది. మునుపటి ఏడాదితో పోల్చుకుంటే.. ఈ ఏప్రిల్–జూన్‌లో బంగారం వినియోగం 10 శాతం పడిపోయింది. ఆభరణాల డిమాండ్ 17 శాతం తగ్గగా.. అదే సమయంలో పెట్టుబడి డిమాండ్ 7 శాతం పెరిగింది.2024లో సెప్టెంబర్ త్రైమాసికంతో 248.3 టన్నుల గిరాకీ ఉండగా.. ఈ ఏడాది ఇదే సమయానికి ఆ మొత్తంలో తగ్గుదల ఉండొచ్చని పేర్కొంది. మరోపక్క.. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిర పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఇది ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గంగా ఉంది. ఈ డిజిటల్ యుగంలో గోల్డ్ ఈటీఎఫ్‌లకు మంచి ఆదరణ ఉందని జైన్ వెల్లడించారు. ఇదిలా ఉంటే..
రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గుచూపుతున్నారు. వివాహాల కారణంగా కొనుగోళ్లు పెరగొచ్చనే అంచనాలున్నాయి.

# ఆరు భారతీయ చమురు కంపెనీలపై అమెరికా ఆంక్షలు




విశ్వంభర, వాషింగ్టన్: సుంకాలు, జరిమానాలతో భారత్‌పై విరుకుపడుతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం.. ఆరు భారతీయ ఆయిల్ కంపెనీలకు షాకిచ్చింది. ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారన్న ఆరోపణలతో మన చమురు కంపెనీలపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చమురుతో నిధులు సమకూర్చుకొని మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలకు ఇరాన్ ఆజ్యం పోస్తున్నదని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో టెహ్రాన్ ఆదాయన వనరులను అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో కాంచన్ పాలిమర్స్, అల్‌కెమికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, రామ్నిక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ, జూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్, పెర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఉన్నాయి. వీటితోపాటు టర్కీ, యూఏఈ, చైనా, ఇండోనేషియాలోని పలు సంస్థలపై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. 2024, జనవరి నుంచి 2025 జనవరి మధ్య ఆయా సంస్థలు ఇరాన్ నుంచి మిథనాల్, టోలున్, పాలీథైలిన్ వంటి పదార్థాలను దిగుమతి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత్‌కు చెందిన చమురు కంపెనీలు పదుల మిలియన్ల అమెరికన్ డాలర్ల విలువ చేసే దిగుమతి చేసుకున్నాయని యూఎస్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

## స్టార్‌లింక్ శాటిలైట్ సేవలు

ప్రపంచ బిలియనీర్ ఎలన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ భారత్‌లో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడానికి యూనిఫైట్ లైసెన్స్‌ను పొందింది, స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం అవసరమైన ఫ్రేమ్‌వర్క్ కూడా ఇప్పటికే అమలులో ఉందని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం తెలిపారు. దేశంలో మొట్టమొదటి సెల్యూలార్ కాల్ చేసి 30 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర మంత్రి తాజా ప్రకటన చేశారు. దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం స్పెక్ట్రమ్ కేటాయింపు, నెట్‌వర్క్ వాడకానికి కావాల్సిన ఫ్రేమ్‌వర్క్‌లు సిద్ధంగా ఉన్నాయి. త్వరలో సజావుగా సేవలు అమలవుతాయని సింధియా అన్నారు. స్టార్‌లింక్‌తో పాటు, భారతీ గ్రూప్–మద్దతుగల యూటెల్‌సాట్ వన్‌వెబ్, జియో ఎస్ఈఎస్ కూడా తమ శాట్‌కామ్ సేవలను ప్రారంభించడానికి స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం వేచి ఉన్నాయని తెలిపారు. గత 11 ఏళ్లలో భారత్ డిజిటల్ వృద్ధిని అత్యంత వేగంగా సాధించింది. మారుమూల గ్రామాల మొదలుకొని రద్దీగా ఉండే నగరాల వరకు అందరికీ డిజిటల్ యాక్సెస్ లభించింది.




# రూటు మార్చేసిన గోపీచంద్.. స్టంట్ మాస్టర్‌తో కొత్త సినిమా..!



గతేడాది బీమా, విశ్వం సినిమాలతో ప్రేక్షకులకు హాయ్ చెప్పాడు గోపీచంద్. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద గోపీచంద్ అభిమానులు, మూవీ లవర్స్‌ను నిరాశ పరిచాయి. ప్రస్తుతం గోపీచంద్ ఘాజీ ఫేం సంకల్ప్‌రెడ్డి డైరెక్షన్‌లో చేస్తున్న సినిమాపై ఫోకస్ పెట్టాడు. ఈ మూవీ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే కంటే ముందే గోపీచంద్ మరో సినిమాను గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడంటూ ఓ వార్త ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇంతకీ ఈ సారి గోపీచంద్ సినిమా చేయబోతుందెవరితోనో తెలుసా..? పాపులర్ ఫైట్ మాస్టర్ వెంకట్‌తో ఈ సినిమా ఉండబోతుందట. ఈ మూవీతో వెంకట్ డైరెక్టర్‌గా మారబోతుండటం విశేషం. హై ఆక్టేన్ యాక్షన్ ఎలిమెంట్స్‌తోపక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. డాకు మహారాజ్, భగవంత్ కేసరి సినిమాలకు అదిరిపోయే స్టంట్స్ కంపోజ్ చేశాడు వెంకట్. ఈ ఫైట్ మాస్టర్ చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశాడట గోపీచంద్. ఈ చిత్రాన్ని యాత్ర, యాత్ర 2 లాంటి పొలిటికల్ బయోపిక్స్ తెరకెక్కించిన 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనుందని సమాచారం. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఆగస్టు 9వ తేదీన ఈ సినిమా ప్రకటన కూడా ఉండనుందని తెలుస్తోంది. మొత్తానికి గోపీచంద్ ఈ సారి ఫైట్ మాస్టర్ చెప్పిన కథతో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కొత్తదనంతో కూడిన సినిమాను ప్రేక్షకులకు అందించాలని చూస్తున్న గోపీచంద్ మరి ఈ సారి రూట్ మార్చి స్టంట్ మాస్టర్‌తో చేయబోతున్న సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.

# అందం కోసం అలా చేయడం తప్పేం కాదు



'ఈ రోజుల్లో అందంగా కనిపించేందుకు ప్రతి ఒక్కరూ కాస్మోటిక్ సర్జరీలు చేయించుకుంటున్నారు. అదేం తప్పు కాదు. అయితే.. ఈ విషయంలో మహిళలను మాత్రమే బ్లేమ్ చేయలేం. కాస్మోటిక్ సర్జరీలను ఆశ్రయిస్తున్న పురుషులు ఈ రోజుల్లో చాలామంది ఉన్నారు. అంతెందుకు సినీ పరిశ్రమలోనే అలాంటి వాళ్లు కోకొల్లలు.' అంటూ బాంబ్ పేల్చారు ఒకనాటి బాలీవుడ్ అందాలతార కాజోల్. ఆమె నటించిన 'సర్ జమీన్' చిత్రం రీసెంట్‌గా ఓటీటీలో విడుదలైంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అందం, గ్లామర్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు కాజోల్. 'అందం లేనివాళ్లు అందంగా కనిపించాలని కోరుకోవడంలో తప్పేంలేదు. కెమెరా ముందు నటించే అవకాశం ఉన్నప్పుడు, అందం కోసం కొన్ని ప్రయత్నాలు చేయడం సమర్ధనీయమే. అలాంటి వారిని జడ్జ్ చేయకూడదు.' అని హితవు పలికారు కాజోల్. వయసు గురించి మాట్లాడుతూ 'ఈ మధ్య నా వయసు కొందరు సోషల్ మీడియావాళ్లకు సమస్యగా మారింది. నా దృష్టిలో ఏజ్ అనేది ఓ నంబర్ అంతే. జీవించడానికి నాకెన్నో అద్భుతమైన సంవత్సరాలు ఇంకా మిగిలివున్నాయి.' అంటూ పేర్కొన్నారు కాజోల్.


# గోవాలో అలనాటి తారల సందడి





ఒకే స్కూల్ లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఒకే కాలేజీలో చదువుకు స్టూడెంట్స్ పదేళ్ళకో, పాతికేళ్ళకో ఒకసారి కలుసుకుని అప్పటి విశేషాలను తలుచుకోవడం, ఆనాటి సంఘటనలను నెమరవేసుకోవడం సహజం. విశేషం ఏమంటే సినిమా తారలూ అందుకు మినహాయింపు కాదు. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ వంటి స్టార్స్ సౌతిండియాలోని తమ సమకాలీనులతో కలిసి ఎయిటీస్ రీ-యూనియన్ పేరుతో గెట్ టు గెదర్ నిర్వహిస్తుంటారు. ఒక్కోసారి ఒక్కో థీమ్ ను పెట్టుకుని దానికి తగ్గట్టుగా డ్రసులు వేసుకుంటారు. హాయిగా మంచి పార్టీ జరుపుకుంటారు. విశేషం ఏమంటే బహుశా ఇదే స్పూర్తితో కావచ్చు... తొంభైల నాటి తారలు సైతం ఇలాంటి ఓ రీ-యూనియన్ ను ఇటీవల గోవాలో జరుపుకున్నారు. ఇందులో అప్పటి హీరోలు, హీరోయిన్లు మాత్రమే కాదు... దర్శకులు సైతం హాజరయ్యారు. ఈ తొంభై దశకం వెండితెర హీరోలు, హీరోయిన్ల రీ-యూనియన్ లో జగపతిబాబు, శ్రీకాంత్, ప్రభుదేవా, కె.ఎస్. రవికుమార్, శంకర్, లింగుస్వామి, మోహన్ రాజా తదితరులు పాల్గొన్నారు. అలానే అలనాటి అందాల భామలు మీనా, సిమ్రాన్, ఊహ, సంఘవి, మాళవిక, సంగీత, రీమాసేన్, మహేశ్వరి, శివరంజనీ ఈ పార్టీకి హాజరయ్యారు. వీరంతా గోవాలో బీచ్ పార్టీలో ఫుల్ ఎంజాయ్ చేశారు. ఉషోదాయాలను, సాయం సంధ్యలను ఎంచక్కా తమ తోటి నటీనటులతో కలిసి ఫోటోలు దిగి, ప్రతి ఒక్కరూ రీ-బూట్ అయ్యారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.


# భారీ రన్‌టైంతో కూలీ, వార్ 2.






ఆగష్టు నెల మూవీ లవర్స్‌కి పండగనే చెప్పాలి. ఒకవైపు స్టార్ నటుడు విజయ్ దేవరకొండ కింగ్‌డమ్ అంటూ ఒక రోజు ముందుగానే బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతున్నాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుంది. అయితే ఈ సినిమా అనంతరం ఇండిపెండెన్స్ డే కానుకగా రెండు పెద్ద సినిమాలు థియేటర్‌లలో సందడి చేయబోతున్నాయి. ఒకవైపు తమిళం నుంచి కూలీ అంటూ రజనీకాంత్ రాబోతుండగా.. హృతిక్ రోషన్ వార్ 2 అంటూ రాబోతున్నాడు. దీంతో ఈ రెండు సినిమాల మధ్య గట్టి పోటీ నెలకొనబోతుంది. ఒకవైపు కూలీ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించడం.. నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, ఆమిర్ ఖాన్ వంటి భారీ తారగణం ఉండటంతో ఈ సినిమాకు తమిళంతో పాటు తెలుగు, కన్నడలో మంచి బజ్ ఏర్పడింది. మరోవైపు వార్ 2 సినిమాలో హృతిక్ రోషన్‌తో పాటు టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ కీలక పాత్రలో నటించడం అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు యష్ రాజ్ బ్యానర్ నిర్మించడం నార్త్‌లో మంచి బజ్ వచ్చింది. అయితే ఈ రెండు సినిమాలు ఒకేరోజు వస్తుండటం మువీ లవర్స్‌కి పండగనే చెప్పాలి. మరోవైపు ఈ సినిమా రన్ టైంకి సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. కూలీ సినిమా 2 గంటల 50 నిమిషాల రన్‌టైంతో రాబోతుంటే.. వార్ 2 ఏకంగా 3 గంటల రన్‌టైంతో రాబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఏ సినిమా ఎలా ఉంటుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అక్షయ్ కుమార్ బిజినెస్ భలే బాగుందిగా..



సినీ నటులు సినిమాలతో పాటు ఇతర మార్గాల్లో కూడా తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త రూట్లు వెతుక్కుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, ఫ్యాషన్ లైన్‌లు, ఫుడ్ బ్రాండ్లు ఇలా విభిన్న రంగాల్లోకి అడుగుపెడతారు. అలాంటి వ్యాపార చాతుర్యం చూపిస్తున్నవారిలో బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ ముందు వరుసలో ఉన్నారు. తాజాగా ఆయన ఒక క్రేజీ బిజినెస్ ద్వారా వార్తల్లో నిలిచారు. అదే రియల్ ఎస్టేట్ ట్రేడింగ్. తక్కువ ధరకు ఫ్లాట్లు కొనుగోలు చేసి, మార్కెట్ విలువ పెరిగిన తర్వాత వాటిని అమ్మేస్తూ భారీ లాభాలను గడిస్తున్న ఆయన, ఈ రంగంలో తన తెలివితేటలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇటీవల అక్షయ్ కుమార్ ముంబై బోరివలి ప్రాంతంలో ఉన్న రెండు అపార్ట్‌మెంట్లను రూ. 7.10 కోట్లకు అమ్మారు. ఈ ఫ్లాట్లు ఆయన 2017లో కొనుగోలు చేశారు. కాలక్రమేణా వీటి విలువ భారీగా పెరగడంతో ఇప్పుడు సుమారు 92% లాభంతో విక్రయించగలిగారు. మొదటి అపార్ట్‌మెంట్‌ను అక్షయ్ రూ. 3.02 కోట్లకు కొనగా, ఇప్పుడు అది రూ. 5.75 కోట్లకు అమ్మారు. స్టాంప్ డ్యూటీగా రూ. 34.50 లక్షలు, రిజిస్ట్రేషన్ ఖర్చులు రూ. 30,000 చెల్లించారు. రెండో అపార్ట్‌మెంట్‌ను రూ. 67.90 లక్షలకే కొనుగోలు చేసిన ఆయన, ప్రస్తుతం దాన్ని రూ. 1.35 కోట్లకు విక్రయించారు. ఇందులో స్టాంప్ డ్యూటీ రూ. 6.75 లక్షలు, ఇతర రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా ఉన్నాయి. ఇది మాత్రమే కాదు. ఈ మార్చిలో అక్షయ్ కుమార్ అదే బోరివలి ఏరియాలోని మరొక రెండు ఫ్లాట్లను రూ. 6.60 కోట్లకు విక్రయించారు. అలాగే, ఏప్రిల్‌లో ముంబై లోయర్ పరేల్ ప్రాంతంలోని ఓ ఆఫీస్ స్పేస్‌ను రూ. 8 కోట్లకు అమ్మారు. ఈ వరుస ఆస్తుల విక్రయాలను చూస్తుంటే అక్షయ్ కుమార్ రియల్ ఎస్టేట్‌ను కేవలం హాబీగా కాకుండా సీరియస్ బిజినెస్‌గా తీసుకుంటున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది. నటనతోపాటు ఇలా వ్యాపారంలోనూ విజయాలను సాధిస్తూ అక్షయ్ తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు.

## రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త చిత్రం..

కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఒక కొత్త చిత్రాన్ని నిర్మించబోతోంది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. చిత్రానికి అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియాలో తెలుపుతూ.. "అన్ని తిరుగుబాటులకు యుద్ధరంగమే ఆధారం కాదు. కొన్ని విధిచేత ఎంపిక చేయబడతాయి, ఇది ఒక తిరుగుబాటుదారుని కథ" అంటూ పోస్ట్ చేసింది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తుండగా, సాయి సౌజన్య కూడా ఈ నిర్మాణంలో పాలుపంచుకుంటుంది. ఫార్చ్యూన్ 4 సినిమాస్ శ్రీకర స్టూడియోస్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నాయి. రిషబ్ శెట్టి చివరిగా 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆయన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తో కలిసి పనిచేయడం, మరియు అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహించడం ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# ఓజీ కోసం వన్స్‌మోర్ అంటోన్న పవన్ కల్యాణ్..



టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. పొలిటికల్ కమిట్‌మెంట్స్ కారణంగా ఆలస్యమవుతూ వచ్చిన సినిమాలు ఒక్కోటిగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విడుదలైన హరిహరవీరమల్లు పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఉస్తాద్‌భగత్ సింగ్, ఓజీ సినిమాలను కూడా పూర్తి చేయడంపైనే తన ఫోకస్ అంతా పెట్టాడు. అయితే కెరీర్‌లో తొలిసారి పవన్ కల్యాణ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నాడని తెలిసిందే. నిర్మాత ఏఎం రత్నం విజ్ఞప్తి మేరకు పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు కోసం ప్రమోషనల్ ఈవెంట్స్‌కు ఎక్కువ సమయం కేటాయించాడు. కాగా సుజిత్ డైరెక్షన్‌లో నటిస్తున్న ఓజీ కోసం కూడా ఇదే రూట్‌ను ఎంచుకోబోతున్నాడట. ఓజీపై బజ్‌ను మరింత పెంచేలా ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని ప్లాన్ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. మరి ఇదే నిజమైతే సినిమాగురించి ఎలాంటి విషయాలు ప్రేక్షకులు, అభిమానులతో షేర్ చేసుకుంటాడనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇమ్రాన్ హాష్మీ, అర్జున్‌దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య నిర్మిస్తున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com